క్లుప్తంగా

సంతోషిమాతకు ప్రత్యేక పూజలు



సంతోషిమాతకు పూజలు చేస్తున్న భక్తులు

భామిని: మండలంలోని బత్తిలి గ్రామంలో ఉన్న సంతోషిమాత ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే అమ్మవారి దర్శనానికి భక్తులు విచ్చేసి, తమ మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం చేశారు.

ఏపీ దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీగా వీరఘట్టం తహసీల్దార్



తహసీల్దార్ మాధవి

వీరఘట్టం: విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఏపీ దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీగా వీరఘట్టం తహసీల్దార్ జల్లేపల్లి మాధవిని నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు కార్యాలయం సిబ్బంది తెలిపారు. ఆరు నెలలుగా ప్రజలకు అత్యుత్తమ సేవలందించిన ఆమెకు ఉద్యోగోన్నతి కలగడంపై మండల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

భూ వివాదాలకు చెక్



వెంకటాపురంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రమణ

సీతానగరం: జగనన్న శాశ్వత భూరక్ష భూ హక్కు పథకం ద్వారా రైతులు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న భూ వివాదాలకు చెక్ పడుతుందని తహసీల్దార్ ఎన్వీ రమణ అన్నారు. అంటిపేట పంచాయతీ వెంకటాపురం గ్రామంలో సర్పంచ్ సిరికి మహేశ్వరరావు అధ్యక్షతన ఈ పథకం అమలుకు సంబంధించి గ్రామ సభ శుక్రవారం జరిగింది. సభలో ఆయన మాట్లాడుతూ రైతుల భూముల వివాదాలను చెక్ పెట్టేందుకే రీసర్వే ప్రభుత్వం చేపట్టిందన్నారు. భూములకు సంబంధించి రెవెన్యూ రికార్డుల్లో నమోదైన తప్పొప్పాలను సరిదిద్ది రైతులకు తమ భూములపై శాశ్వత భూ హక్కు కల్పించేందుకు రీసర్వే చేపట్టిందన్నారు. సమావేశంలో ఉప సర్పంచ్ జి.తిరుపతిరావు, వైఎస్సార్ సీపీ మండల నాయకుడు విదాబాబు, మండల సర్వేయరు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన తప్పనిసరి



వార్డులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి

పార్వతీపురం టౌన్: సీజనల్ వ్యాధులపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి వుండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి అన్నారు. డ్రై డే కార్యక్రమంలో భాగంగా పార్వతీపురం పట్టణం 18వ వార్డులో ప్రజలకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శీతాకాలం కారణంగా ప్రజలకు జ్వరాలపై అప్రమత్తం చేస్తూ మలేరియా, డెంగీ మొదలైన పరీక్షలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతీ ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎవరికైనా జ్వర లక్షణాలు ఉంటే వెంటనే పరీక్షలు చేయించాలని సిబ్బందికి వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని దోమలు ప్రబలకుండా పరిశుభ్రంగా ఆంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదినారాయణ, హెల్త్ సూపర్‌వైజర్ పుష్ప, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ల ఆకస్మిక తనిఖీ



వాటర్ ప్లాంట్ తనిఖీ చేస్తున్న జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి రమణ

పార్వతీపురం టౌన్: జిల్లాలో గల వాటర్ ప్లాంట్లలో నాణ్యతా ప్రమాణాల పరిశీలనకు ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్టు జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి పీపీ రమణ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ప్రత్యేక తనిఖీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పార్వతీపురం యంపీఆర్, ఇండస్ట్రీస్, సాయిరాం పోర్టబుల్ వాటర్ ప్లాంటులతో తనిఖీలు నిర్వహించి శాంపిల్స్ తీసుకుని నాణ్యతా ప్రమాణాల పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించినట్లు తెలిపారు. వారికి గల బీఎస్ఐ, ఐఎస్ఐ, భద్రతా ప్రమాణాల అనుమతులు పరిశీలించామన్నారు. వాటర్ ప్లాంట్లలో పరిశుభ్రత పాటించాలని సూచించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సర్కిల్ ఇన్‌స్పెక్టరు బి.సింహాచలం, సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్లోమీడియా రాతలను ప్రజలు నమ్మరు

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

పాలకొండ: ప్రజలకు మంచి చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై అక్కసుతో ఎల్లోమీడియా రాస్తున్న రాతలను ప్రజలు ఎప్పటికీ నమ్మరని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. శుక్రవారం స్థానిక పట్టణంలో మీడియాతో మాట్లాడిన వారు అవినీతి లేని పాలన అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలను తీసుకువచ్చారని, వీటికి దేశ వ్యాప్తంగా మంచి పేరుందన్నారు. ఇటువంటి వ్యవస్థలపై ఎల్లోమీడియా తప్పుడు కథనాలు ప్రచురిస్తుండడం విచారకరమన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికీ ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్న వలంటీర్లు, వారి సేవలపై ఎల్లోమీడియా, చంద్రబాబుకు ఎందుకు అంత కుళ్లు అని ప్రశ్నించారు. టీడీపీ హయాంలో ప్రజలకు జరగని మంచి ఇప్పుడు సీఎం జగన్ మోహన్‌రెడ్డి హయాంలో జరుగుతుందనే ప్రభుత్వంపై చెడ్డపేరు వచ్చేలా పదేపదే ఆరోపణలు చేస్తూ నవ్వుల పాలవుతున్నారని దుయ్యబట్టారు.

గతంలో టీడీపీ జన్మభూమి కమిటీలు తమకు నచ్చిన వారికే ప్రభుత్వ ఫలాలు అందించే వారని, ఇప్పటి వలంటీర్లు అర్హులకే నేరుగా పథకాలు అందిస్తున్నారని వివరించారు. ఎవరి పరిపాలనలో ఎవరికి లబ్ధి జరిగిందో ప్రజలకు బాగా తెలుసని, వచ్చే ఎన్నికల్లోనూ చంద్రబాబు అండ్ కో..కు ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం జగనన్న వెంటే జనం ఉన్నారని, వచ్చే ఎన్నికల్లోనూ తిరుగులేని మెజార్టీతో ఆయన మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని జోష్యం చెప్పారు. టీడీపీ దాని విషపత్రికల్లో వచ్చే కథనాలను ప్రజలు నమ్మడం లేదన్నారు.

ఇంటి పన్ను వసూలు చేయాలి



మాట్లాడుతున్న ఈఓపీఆర్‌డీ గోపాలరావు

గరుగుబిల్లి: ఇంటి పన్ను వసూలు చేయాలని ఎంపీడీఓ జి.పైడితల్లి సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమైన ఆమె ఈ నెలాఖరులోగా ఇంటి పన్ను వసూలు లక్ష్యం శతశాతం పూర్తి చేయాలన్నారు. ఈఓపీఆర్‌డీ ఎల్.గోపాలరావు మాట్లాడుతూ గ్రామాభివృద్ధి ప్రణాళికలను ఈ-గ్రామస్వరాజ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి, 'మిషన్ అంత్యోదయ' సర్వేను పూర్తి చేసి, ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. గ్రామాల్లో తిరుగుతున్న వీధి కుక్కల నియంత్రణకు పశువైద్య సహాయకులతో వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సంక్రాంతి పండగ తర్వాత గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. శంబర జాతరకు 10 మంది క్లాప్ మిత్రలను పంపించడం జరుగుతుందన్నారు. ఉద్యోగులంతా ముఖ ఆధారిత(ఫేస్ అథెంటికేషన్) హాజరు నమోదు చేయాలన్నారు.

గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి

- వైఎస్సార్ సీపీ నాయకులు తోట సింహాచలం, బోనగడ్డి ధర్మారావు



కోటకొండ ఆదివాసీలతో మాట్లాడి, వారి సమస్యలు అడిగి తెలుసుకుంటున్న వైఎస్సార్ సీపీ నాయకులు

భామిని: గిరిజన ప్రాంతాల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వైఎస్సార్ సీపీ నాయకులు తోట సింహాచలం, బోనగడ్డి ధర్మారావు తెలిపారు. మండలంలోని బొడ్డగూడ సచివాలయం పరిధిలోని కోసింగిగూడ, కోటకొండ గ్రామాల్లో శుక్రవారం పర్యటించిన వారు అక్కడి వారితో మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఐదేళ్ల క్రితం ఆధార్ చేయించుకున్న వారంతా ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలని, కొత్తగా పెళ్లయిన వారు ఉన్న రేషన్ కార్డు నుంచి తొలగి, కొత్త రేషన్‌కార్డులో నమోదుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ఆదివాసీల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు గూడకొక గ్రామ వలంటీరును నియమించేందుకు ప్రయత్నిస్తామన్నారు. అలాగే ఏవైనా సమస్యలు ఉంటే చెప్పాలని, వాటిని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కారమయ్యేలా చూస్తామన్నారు. వారి వెంట పార్టీ నాయకులు గేదెల మోహన్, బిడ్డికి లక్కాయి ఉన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



బ్రీత్ ఎనలైజర్‌తో వాహనదారుడిని పరీక్షిస్తున్న ఎస్ఐ శివప్రసాద్

పాలకొండ రూరల్: పాలకొండ-శ్రీకాకుళం, పాలకొండ-విశాఖపట్నం, పాలకొండ-సీతంపేట రోడ్లలో పోలీసులు శుక్రవారం వాహన తనిఖీలు చేపట్టారు. లైసెన్స్, ఆర్‌సీ, సీబుక్ లేని వారితో పాటు మద్యం తాగి వాహనం నడుపుతున్న వారిపై చర్యలు తీసుకున్నారు. అధిక లోడు, పరిమితికి మించి ప్రయాణికులతో వస్తున్న వాహనదారులకు అపరాధ రుసుం విధించారు. ప్రతిఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని, లేకపోతే చర్యలు తప్పవని ఎస్ఐ బి.శివప్రసాద్ హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇచ్చిన వారిపై తొలుత చర్యలు తీసుకుంటామన్నారు. వాహనాలతో రోడ్ల పైకి వచ్చేటప్పుడు సంబంధిత ధ్రువపత్రాలు వెంట తీసుకురావాలన్నారు.

వేగవంతంగా ఇళ్ల నిర్మాణాలు



సమావేశంలో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ రఘురాం

పాచిపెంట: ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని హౌసింగ్ పీడీ రఘురాం అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని హౌసింగ్ అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో హౌసింగ్‌పై శుక్రవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సచివాలయాల వారీగా ఇళ్ల నిర్మాణాలు ప్రగతిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు శ్లాబ్ నిర్మాణాలు పూర్తయిన ఇళ్లకు ఉగాది నాటికి గృహప్రవేశాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే శాఖాపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీడీఓ లక్ష్మీకాంత్, డీఈ సోమేశ్వరరావు, ఏఈ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో 62 రకాల మందులు



సంఘంవలసలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ అనూష

పార్వతీపురం టౌన్: ఫ్యామిలీ డాక్టర్ విధానంలో ఇంటింటికి వైద్య సేవలు అందిస్తున్నామని, అందుబాటులో 62రకాల మందులు ఉన్నాయని వైద్యాధికారిని అనూష అన్నారు. మండలంలోని సంఘంవలస గ్రామంలో వైద్యశిబిరాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. అవసరమైన వారికి వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో నేలకు రెండు సార్లు నిర్వహించే వైద్య శిబిరాన్ని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో నిర్వహించే శిబిరంలో 8 రకాల వైద్య పరీక్షలను నిర్వహిస్తున్నామన్నారు. అందుబాటులో 62రకాల మందులు అందుబాటులోఉన్నాయని, రోగికి అవసరమైన మేరకు మందులను అందజేస్తున్నామన్నారు. గ్రామాల్లో మంచాన పడి వున్న రోగుల వద్దకు వెళ్లి ఇళ్లవద్దనే వైద్య సేవలను అందిస్తున్నామన్నారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న ఈ ఫ్యామిలీ డాక్టర్ విధానానికి మంచి స్పందన లభిస్తుందన్నారు. రోగాల బారిన పడి గ్రామాల్లో ఏ ఒక్కరు ఉండకూడదనే ఉద్దేశంతో నిబద్ధతతో విధులను నిర్వహిస్తున్నామని, ప్రజలంతా ఈ వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, సీహెచ్‌ఓలు, 104 సిబ్బంది, డేటా ఎంట్రీ ఆపరేటర్‌లు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు

వీరఘట్టం: రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని, మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ఎ.ప్రభాకరరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో శుక్రవారం సమావేశమైన ఆయన గ్రామాల్లో తాగునీటి వనరుల పునరుద్ధరణకు ఇప్పటించే చర్యలు ప్రారంభించాలన్నారు. మరమ్మతులకు గురైన బోర్లు, అడుగంటిన బావులను గురించి, బాగు చేయాలన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించండి

వీరఘట్టం: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఎస్ఐ ఎం.హరికృష్ణ సూచించారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా స్థానిక కొత్తబస్టాండ్ సెంటర్‌లో ఆటోడ్రైవర్లకు ట్రాఫిక్ రూల్స్‌పై శుక్రవారం అవగాహన కల్పించారు. లైసెన్స్ ఉన్న వారు మాత్రమే వాహనం నడపాలని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని వాహనంతో వెళ్లరాదన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దన్నారు.

ఫ్రైడే డ్రై డేగా పాటించాలి



ఫ్రైడే- డ్రైడే ర్యాలీలో పాల్గొన్న డీఐఓ జగన్మోహనరావు

సీతానగరం: ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఫ్రైడే – డ్రైడే పాటించి పరిశుభ్రమైన వాతావరణం కలిగి ఉండేలా వైద్య సిబ్బంది జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డీఐఓ) టి.జగన్మోహనరావు అన్నారు. శుక్రవారం చినబోగిలిలో సీతానగరం ఆర్‌సీహెచ్ వైద్యాధికారిణి ఉషారాణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్రైడే డ్రైడే ర్యాలీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాడుక నీరు ఆరిపోయే విధంగా ప్రజలకు వివరించాలని కోరారు. అలాగే వీధుల్లో వాహనాల నుండి తీసేసిన టైర్లు, కొబ్బరి నీరు తీసిన తరువాత పారేసిన కొబ్బరి బురికెలు రోడ్డుపై విసిరేయడం వలన దోమలు ప్రబలడంతో వ్యాధులకు గురి చేస్తాయన్నారు. దోమల నివారణకు ప్రజలను చైతన్య పర్చాలని, ప్రతి శుక్రవారం శిథిలమైన కుండీలు, కొబ్బరి బురికెలు దూర ప్రాంతాల్లో వేయాలని సూచలు ఇవ్వాలని కోరారు. అనంతరం ఆర్‌సీహెచ్‌లో వ్యాధి నిరోధక మందులు నిల్వలు వినియోగంపై డాక్టర్ శిరీష, అరుణకుమారి, సూపరువైజర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

24 వరకు రహదారి భద్రతా వారోత్సవాలు

సాలూరు: రహదారి భద్రతా వారోత్సవాలు ఈ నెల 24 వరకు నిర్వహించనున్నట్టు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు. పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలు శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఒడిశా నుంచి ధాన్యం అక్రమ రవాణా నియంత్రణకు కలెక్టర్, డీటీఓ ఆదేశాల మేరకు పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద పోలీసు శాఖతో కలిసి సంయుక్తంగా వాహన తనిఖీలు చేపడుతున్నామని తెలిపారు.

పూర్తి కావచ్చిన ఇంటింటి కుళాయి పనులు

సీతానగరం: మండలంలో ఇంటింటి కుళాయిల ద్వారా తాగునీరు సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పవన్‌కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక విలేరులతో ఆయన మాట్లాడారు. అంటిపేట పంచాయతీ పరిధిలోని వెంకటాపురం, వెన్నెలబుచ్చింపేట గ్రామాల్లో జరుగుతున్న ఇంటింటి కుళాయిల నిర్మాణ పనులు అండర్ గ్రౌండ్ పైపులైన్లు వేయడం, ఇళ్ల ముందు ట్యాప్‌లు అమర్చడం జరుగుతుందన్నారు. కుటుంబాలున్న ఇళ్లకు కుళాయి పనులు పూర్తి కావచ్చాయని తెలిపారు. ఇప్పటికే వివిధ గ్రామాల్లో ఎమ్మెల్యే అలజంగి జోగారావు చేతుల మీదుగా ఇంటింటి కుళాయిలును ప్రారంభించినట్లు పేర్కొన్నారు.

3,818 క్వింటాళ్ల ధాన్యం తరలింపు



మాట్లాడుతున్న ఏఎంసీ కార్యదర్శి ఈశ్వరరావు

కురుపాం: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నాలుగు ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి ఇప్పటివరకు 135 మంది రైతుల నుంచి 3,818 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసి, రైస్‌మిల్లులకు తరలించామని ఏఎంసీ కార్యదర్శి కె. ఈశ్వరరావు శుక్రవారం తెలిపారు. ధాన్యానికి సంబంధించిన బిల్లులు కూడా రైతుల బ్యాంకు ఖాతాల్లో సకాలంలో జమ అవుతున్నాయన్నారు. మార్కెట్ కమిటీ సెస్ కలెక్షన్స్ కూడా 90 శాతం పూర్తయిందన్నారు. కురుపాం ఏఎంసీ ఆధ్వర్యంలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.80 లక్షల సెస్ కొనుగోలు లక్ష్యం కాగా జనవరి 20వ తేదీ నాటికి రూ.70 లక్షలు వసూలు చేయడం జరిగిందన్నారు.

సామాజిక భవన నిర్మాణానికి స్థలం కేటాయింపు



సామాజిక భవన నిర్మాణానికి సంబంధించి, హక్కు పత్రం అందజేస్తున్న ఐటీడీఏ పీఓ నవ్య

సీతంపేట: మండలంలోని కడగండి పంచాయతీ పరిధి, కడగండివలస గ్రామంలో సామాజిక భవన నిర్మాణానికి స్థలం కేటాయించారు. ఈ మేరకు భవన నిర్మాణానికి సంబంధించి, హక్కు పత్రాన్ని ఐటీడీఏ పీఓ బి.నవ్య శుక్రవారం గ్రామస్తులకు అందజేశారు. అలాగే నాడు-నేడు పనుల కింద పాఠశాల భవన నిర్మాణానికి రూ.13 లక్షలు మంజూరు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు ఎస్.రాము, సాయికుమార్ పాల్గొన్నారు.

సబ్‌కలెక్టర్ పరిశీలన



ఆర్ అండ్ బీ కార్యాలయ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్

పాలకొండ రూరల్: పాలకొండ-సీతంపేట రోడ్డు ఆనుకుని ఉన్న ఆర్ అండ్ బీ కార్యాలయ ప్రాంగణంలోని 20 సెంట్ల ఖాళీ ప్రదేశాన్ని సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ శుక్రవారం పరిశీలించారు. ఐటీడీఏ ద్వారా సమకూరే నిధులతో ఈ ప్రదేశంలో పెట్రోల్ బంకు లేదా ఇతర అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు. సబ్‌కలెక్టర్ వెంట డిప్యూటీ తహసీల్దార్ బుచ్చయ్య తదితరులు ఉన్నారు.

మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలి



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఎంపీడీఓ పైడితల్లి

గరుగుబిల్లి: జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం పెట్టాలని ఎంపీడీఓ జి.పైడితల్లి సూచించారు. శుక్రవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆమె అక్కడి విద్యార్థుల విద్యాసామర్థ్యాలు పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. పిల్లలకు పెట్టే భోజనం రుచి, శుచితో కూడినదై ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ డీఈఓ సందర్శన



గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈఓ

కురుపాం: స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను డిప్యూటీ డీఈఓ పి.బ్రహ్మాజీరావు శుక్రవారం సందర్శించారు. అనంతరం ఉపాధ్యాయుల పాఠ్యాంశ బోధన, విద్యార్థుల విద్యాసామర్థ్యాలు పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు అత్యధిక మార్కులు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ విద్యార్థి విద్యా ప్రగతిపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. చదువు ఎంత ముఖ్యమో ఆరోగ్యం కూడా అంతే ముఖ్యమని, ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండేలా జాగ్రత్త వహించాలన్నారు. నాణ్యమైన భోజనం, విద్య అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రామగోవింద తదితరులు పాల్గొన్నారు.

పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ

వీరఘట్టం: తల్లిదండ్రులు తమ పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ప్రధానోపాధ్యాయుడు యు.అప్పారావు సూచించారు. మండలంలోని తలవరం గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడైన ఈయన శుక్రవారం గ్రామంలోని పదో తరగతి విద్యార్థుల ఇంటింటికీ వెళ్లి, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. పాఠశాల నుంచి వచ్చిన విద్యార్థులకు పనులు చెప్పకుండా చదుకునే అవకాశం కల్పించాలన్నారు.

ఏప్రిల్ 3 నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరుగుతాయని, వారికి ఇప్పటి నుంచే ఇంట్లో ప్రశాంత వాతావరణం ఉండేలా జాగ్రత్త వహించాలన్నారు. టీవీ, సెల్‌ఫోన్లకు దూరంగా విద్యార్థులను ఉంచాలన్నారు.

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

- డీఈఓ ఎస్‌డీవీ రమణ



విద్యార్థుల విద్యాసామర్థ్యాలు పరీక్షిస్తున్న డీఈఓ రమణ

గరుగుబిల్లి: పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని, ఆ దిశగా సిబ్బంది కృషి చేయాలని డీఈఓ ఎస్‌డీవీ రమణ సూచించారు. మండలంలోని కొత్తూరు, రావుపల్లి గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాలలను శుక్రవారం సందర్శించిన ఆయన ఉపాధ్యాయుల విద్యాబోధన, విద్యార్థుల విద్యాసామర్థ్యాలను పరిశీలించారు. ప్రతీ విద్యార్థి విద్యా ప్రగతిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అలాగే విద్యార్థుల ఆరోగ్యం కూడా బాగా చూసుకోవాలన్నారు. నాణ్యమైన భోజనం మెనూ ప్రకారం అందేలా చూడాలన్నారు. విద్యార్థులు కూడా క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలన్నారు.

ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలి

భామిని: ప్రతిఒక్కరూ విధిగా ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలని తహసీల్దార్ నీలాపు అప్పారావు ఓ ప్రకటనలో శుక్రవారం కోరారు. మండల కేంద్రంలో రెండు, మండల పరిధిలోని బత్తిలి, బాలేరు, ఘనసర ప్రాంతాల్లో ఒక్కొక్కటి చొప్పున ఆధార్ అప్‌డేట్ కేంద్రాలు ప్రారంభమయ్యాయని, అందుబాటులో ఉన్న కేంద్రాలకు వెళ్లి, ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలని తెలిపారు. ఐదేళ్ల క్రితం ఆధార్ చేయించుకున్న వారంతా తప్పనిసరిగా ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలన్నారు.

వేతనదారులందరికీ పనులు కల్పించాలి



ఉపాధి పనులు పరిశీలిస్తున్న డ్వామా పీడీ రామచంద్రరావు

గరుగుబిల్లి: జాబ్‌కార్డు కలిగిన వేతనదారులందరికీ ఉపాధి పనులు కల్పించాలని డ్వామా పీడీ కె.రామచంద్రరావు అన్నారు. మండలంలోని ఉద్దవోలు గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. రెండు పూటలా పనిచేస్తే రోజుకు రూ.257 వేతనం లభిస్తుందన్నారు. బోగస్ మస్టర్లు వేసినా, పని ప్రదేశంలో వేతనదారులు లేకపోయినా చర్యలు ఊరుకోమన్నారు.